ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
గురువారం 11 ఏప్రిల్ 2024



తాగునీటి సమస్య పట్టదా?



కనెక్షన్ ఇవ్వకపోవడంతో పైపు ద్వారా మళ్లిస్తున్న నీరు

- పైప్ లైన్లు వేశారు.. కనెక్షన్లు మరిచారు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం
- ఏళ్లు గడుస్తున్నా స్పందన కరువు
- మిషన్ భగీరథ అధికారుల వైఖరిపై ప్రజల ఆగ్రహం

మంచిర్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా రక్షిత మంచినీటి కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్న మంచిర్యాల పుర ప్రజల సమస్య ఎప్పుడు తీరుతుందో అంతుపట్టకుండా ఉంది. మిషన్ భగీరథ అధికారుల తీరుతో ఈ పరిస్థితి నెలకొంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు తలాపునే ఉన్నప్పటికీ జిల్లా కేంద్రంలో నివసిస్తున్న ప్రజల దాహార్తి మాత్రం తీరడంలేదు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం పూర్తయితే తమ దాహార్తి తీరుతుందని భావించిన పుర ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. మిషన్ భగీరథ పనులు దాదాపుగా పూర్తికాగా ఇతర ప్రాంతాలకు నీటి సరఫరా కూడా జరుగుతోంది.

మిషన్ భగీరథ పథకం ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని దాదాపు 4 లక్షల మంది దాహార్తి తీరనుండగా కేవలం మంచిర్యాల మునిసిపాలిటీ పరిధిలోని ప్రజలకు మాత్రం రక్షిత మంచినీరు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

రూ. 58 కోట్లతో ప్రత్యేక పథకం..

మిషన్ భగీరథ పథకంలో భాగంగా మంచిర్యాల పట్టణ ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు రూ. 58 కోట్లతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ప్రజా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అండాళమ్మ కాలనీ సమీపంలో గల జాల గుట్టవద్ద పనులు చేపట్టారు. ఈ పనులు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియ 2017 జూన్‌లో ముగియగా హైద్రాబాద్‌లోని రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌తో సెప్టెంబర్ 27న అగ్రిమెంటు పూర్తయింది. అగ్రిమెంట్ అయిన నాటినుంచి 18 నెలల్లో పనులు పూర్తి చేసి, ప్రజలకు నిత్యం తాగునీరు అందించాల్సి ఉండగా ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపుల నిర్మాణ పనులు పూర్తి కానందున ఇంతకాలం నీటి సరఫరా జరుగలేదు.

పనుల ప్రణాళిక ఇలా..

పనుల ప్రణాళికను సంబంధిత అధికారులు ఇలా రూపొందించారు. ఇందులో భాగంగా రూ. 84 లక్షలతో జాల గుట్ట కింద 1500 కిలీ లీటర్ల సామర్థ్యంతో నీటిని నిలువ చేసే సంప్ నిర్మాణంతోపాటు పట్టణంలోని రిజర్వాయర్లకు నీరు పంపింగ్ చేసేందుకు గుట్టపై రూ. 47 లక్షలతో 500 కిలీ లీటర్ల సామర్థ్యంగల జీఎల్‌బీఆర్ (గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్), అండాళమ్మ కాలనీలో రూ. 85.27 లక్షలతో 500 కిలీ రిజర్వాయర్, ఉమర్‌మియా కాలనీలో రూ. 1 కోటి 24 లక్షల 36 వేలతో 800 కిలీ వాటర్ ట్యాంక్, దొరగారిపల్లిలో 98.63 లక్షలతో 600 కిలీ వాటర్ ట్యాంక్ నిర్మించాల్సి ఉండగా ఆలస్యమైనా ఎట్టకేలకు పనులు పూర్తయ్యాయి. అలాగే రూ. 14 కోట్లతో గుట్ట పైన జీఎల్‌బీఆర్ నిర్మాణం కూడా పూర్తికాగా, అక్కడి నుంచి ప ట్టణంలోని ఆయా వాటర్ ట్యాంకుల వరకు 110 కిలో మీటర్ల మేర పైప్‌లైన్లు నిర్మాణం కూడా పూర్తయింది.



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

గ్రిడ్ పనులు పూర్తయినా..

పట్టణవాసులకు తాగునీరు అందించేందుకు వాటర్ గ్రిడ్‌కు సంబంధించి పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రస్తుతం ప్రతిరోజు 7 ఎంఎల్‌డీ నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా మరో 10 ఎంఎల్‌డీ నీరు అదనంగా అందనుండగా నిత్యం సరఫరా చేసే వీలుంటుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు సమీపంలో నిర్మించిన 95 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) సామర్థ్యంగల నీటిశుద్ధి ప్లాంటు నుంచి నీరు నేరుగా హాజీపూర్ మండలం ధర్మారం గ్రామ సమీపంలోని బుగ్గ గుట్టపై నిర్మించిన ఓహెచ్‌బీ (ఓవర్ హెడ్ బ్యాలెన్స్) రిజర్వాయర్‌లోకి చేరుతుంది. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ముల్కల్ల గ్రామ సమీపంలోని మున్సిపాలిటీ పంప్ హౌస్‌కు చే రుతుంది. అక్కడి నుంచి భగీరథ పైప్‌లైన్ ద్వారా మంచిర్యాల పట్టణంలోని అండాళమ్మకాలనీ సమీపంలో జాలా గుట్టపై నిర్మించిన 1500 కిలీ సంప్‌లోకి చేరుతుంది. గుట్టపైన ఉన్న జీఎల్‌బీర్ నుంచి పట్టణంలోని 8 రిజర్వాయర్లకు నీరు అందించాల్సి ఉండగా, అక్కడి వరకు ప్రక్రియ సజావుగా సాగుతోంది.

అధికారుల నిర్లక్ష్యం..

మంచిర్యాల పట్టణ ప్రజలకు ప్రత్యేకంగా తాగునీరు అందించే పథకం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇవ్వడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మిషన్ భగీరథ పైపుల నుంచి అంతర్గతంగా వీధుల్లో కూడా నీటి సరఫరా కోసం ప్రత్యేక లైన్లు వేశారు. ఆ లైన్ల నుంచి ఇళ్లకు కనెక్షన్లు మాత్రం ఇవ్వడం లేదు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా... స్పందిం చడం లేదనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా, ఇప్పటికే వీధుల్లో అంతర్గత పైపులైన్లు వేసి నందున నీటి సరఫరా జరుగుతోంది.

ఇళ్లలోకి కనె క్షన్లు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన హెచ్‌డీ పైపులను మెయిన్ లైన్‌కు ఇచ్చి వదిలి వేయడంతో నీరంతా వృథాగా పోతోంది. నీరు వృథా కావడం చూడలేని కొన్ని వార్డుల్లో ప్రజలు తాత్కాలికంగా పైపులు అమర్చి మళ్లిస్తున్నా.... వాహనాల రాకపోకలకు పగిలిపోయి రక్షిత మంచి నీరంతా రోడ్ల పాలు అవుతోంది. వేసవికాలం కావడంతో మండుతున్న ఎండలకు ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు అడుగంటుతున్న తరుణంలో ఇలా తాగు నీరు వృథాగా పోతున్నా స్పందించే వారు కరువయ్యారు. ఇప్పటికైనా కనెక్షన్లు త్వరగా ఇవ్వడం ద్వారా రక్షిత మంచి నీటి వృథాను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన జిల్లాస్థాయి ప్రేరణ పోటీలు

ఏసీసీ, ఏప్రిల్ 10: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ప్రేరణ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో 95 పాఠశాలల నుంచి 77 మంది బాలురు, 102 మంది బాలికలు పాల్గొన్నారు. వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, నృత్యం, గానం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఓవరాల్‌గా 15 మంది బాలురు, 15 మంది బాలికలను ఎంపిక చేసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో ఒక బాలుడు, బాలికను ఎంపిక చేశారు. వీరు ఇద్దరిని గుజరాత్‌లో నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి పంపించనున్నట్లు విద్యాశాఖ కో ఆర్డినేటర్ సత్యనారా యణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'రఘునాథ్ క్షమాపణలు చెప్పాలి'

ఏసీసీ, ఏప్రిల్ 10 : చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని దళిత సంఘాల నాయకులు అన్నారు. రఘునాథ్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లరిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో హరికృష్ణ, శ్రీనివాస్, నర్సయ్య, శివకుమార్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనం ఎక్కి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 10: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి భవనం ఎక్కి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం కలకలం రేపింది. పట్టణానికి చెందిన రాజు అనే ట్రాక్టర్‌డ్రైవర్ కుటుంబ కలహాలతో హెయిర్ డై తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. గమనించిన స్నేహితులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడకు వెల్లగానే తనకు చికిత్స అవసరం లేదని చనిపోతానంటూ రాజు హడావుడి చేశాడు. తాను చికిత్స చేయించుకోనని పరిగెత్తుకుంటూ వెళ్లి ఆస్పత్రి భవనంపైకి ఎక్కాడు. సమాచారం అందుకున్న అవుట్‌పోస్టు పోలీసులు నెమ్మదిగా రాజును భవనంపై నుంచి కిందకు దించి కౌన్సెలింగ్ ఇచ్చి చికిత్సకు పంపించారు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా గతంలో రాజుపై పలు కేసులు నమోదై ఉన్నాయని చెప్పారు. మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యయత్నానికి పాల్పడి ఉంటాడని తెలిపారు.

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

నస్పూర్, ఏప్రిల్ 10: నస్పూర్ పట్టణం గాంధీ నగర్‌లో గల నూర్ మజీద్‌లో బుధవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సుర్మిళ్ళ వేణు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖలీద్, యుగేందర్, గఫార్ పాల్గొన్నారు.

సక్రమంగా నీటిని సరఫరా చేయాలి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 10: మండలంలోని గ్రామాల్లో యాక్షన్ ప్లాన్ ప్రకారం రూపొందించుకుని నీటిని సరఫరా చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడా లని, అవసరం అయితే వ్యవసాయ బోర్లను వాడుకోవాల న్నారు. పైపులైన్ల లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయిం చాలని సూచించారు. ఎంపీవో బీరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

నస్పూర్, ఏప్రిల్ 10: నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. నస్పూర్ మున్సిపాలిటీలోని 23వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే పరి శీలించారు. వార్డులోని వివిధ వాడల్లో డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 23 లక్షల వ్యయంతో నిర్మిస్తు న్న మురుగు కాలువల పనులను పర్యవేక్షించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సి పాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమం లో మున్సిపల్ ఛైర్మన్ సుర్మిళ్ళ వేణు, స్థానిక కౌన్సిలర్ అగల్ డ్యూటి రాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్, మహిళా నాయకురాలు పుట్ట యశోద, మైనార్టీ నాయకులు కలీద్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్: హాజీపూర్ మండల కేంద్రంలోని బోళ్ల కాలనీలో ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను బుధవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పరిశీలించారు. డ్రైనేజీ నిర్మిస్తున్న కాంట్రాక్టర్ ఇష్టారాజ్యాంగా వంకరగా నిర్మిస్తుండడంతో కాంట్రాక్టర్‌పై ఎ మ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను చేయాలన్నారు. అక్కడే ఉన్న పలువురు ఎల్లంపల్లి నిర్వాసితులు తమకు రావాల్సిన మూడు లక్షల ప్యాకేజీతో పాటు ఇందిరమ్మ గృహాలు నిర్మించుకున్నందుకు వచ్చే రూ. 70 వేలను మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంతకుముందు ధర్మారంలో నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించారు. వర్షాకానికి ముందే సీసీ రోడ్లు, డ్రైనేజీలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు

ఏసీసీ: పట్టణంలోని హమాలీవాడలో నిర్మిస్తున్న 60 ఫీట్ల రోడ్డు పనులను బుధవారం స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని , త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నస్పూర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

సత్యదేవుడి సన్నిధిలో భక్తుల పూజలు

దండేపల్లి, ఏప్రిల్ 10: గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలోని అంజనేయస్వామి మందిరంలో బుధవారం పెద్ద ఎత్తున హనుమాన్ భక్తులు దీక్షలు తీసుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో నంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు మాలధారణ తీసుకున్నారు.

సమాజ సేవలో ఆదర్శంగా నిలవాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి, ఏప్రిల్ 10: సమాజ సేవలో ఆదర్శంగా నిలవాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక సింగరేణి కళావేదికలో నిర్వహించిన అమ్మఒడి ఎన్జీవో అన్నదాత ప్రాజెక్టు నాలుగో వార్షికోత్సవ వేడుకలకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. అమ్మఒడి అన్నదాన ప్రాజెక్టు నిరంతరాయంగా కొనసాగుతూ 246 వారాలు పూర్తి చేసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం గొప్ప విషయమని చెప్పారు. తమ వంతు సహాయ సహకారాలు కూడా అందిస్తామని తెలిపారు . అనంతరం ఎన్జీవో వ్యవస్థాపకులు అజ్మీర మోహన్, రిటైర్డు ప్రధానోపాధ్యాయులు ముక్క రమేష్‌లతో కలిసి ఏసీపీ రవికుమార్ అమ్మ ఒడి సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం రాంజీగోండు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఒడి బెల్లంపల్లి బ్రాంచ్ మేనేజర్ హనుమాండ్ల మధు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేదరి దేవవరం

లక్సెట్టిపేటరూరల్, ఏప్రిల్ 10: ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేదరి దేవవరం డిమాండ్ చేశారు. బుధవారం లక్సెట్టిపేట మండలంలోని దౌడపల్లిలో కూలీల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, మెడికల్ కిట్‌లు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. గత రెండు నెలల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతిరెడ్డి రమణారెడ్డి, నాయకులు దుర్గం దేవన్న, ఆకుల రామన్న తదితరులుపాల్గొన్నారు.

జ్యోతిబాఫూలేకు భారతరత్న ప్రకటించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న బీసీ సంఘం నాయకులు

నస్పూర్, ఏప్రిల్ 10: సమాజంలో కుల వివక్ష, అంటరానితనంపై ప్రజల ను చైతన్యవంతం చేసిన జ్యోతిబాఫూలేకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ ఎదుట జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ ఏవో రాజేశ్వర్ కు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాల్య, వితంతు వివాహాల నిర్మూలన, సతీ సహగమనం వంటి వాటిపై ప్రజలను చైతన్య వంతం చేసిన సంఘ సంస్కర్త పూలే అన్నారు. అలాంటి వ్యక్తికి భాతర రత్న ప్రకటించాలని కోరారు. ఆయన జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్ర పటం పెట్టె విధంగా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బొడెంకి మహేష్, నాయకులు అంకం సతీష్, చంద్రమౌళి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అడుగంటుతున్న గొల్లవాగు ప్రాజెక్టు

- పొలాలు ఎండిపోతాయని రైతుల ఆందోళన

భీమారం, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్టులోని నీరు అడుగంటిపోతోంది దీంతో ప్రస్తుతం ఆయకట్టు కింది సాగు చేసిన పొట్ట దశలో ఉన్న వరి పంటకు నీరు అందని దుస్థితి నెలకొంది. మరో నెల రోజుల పాటు నీరు అందిస్తేనే పంట చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు. పొలాలు ఎండిపోతే పెట్టుబడులు నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది యాసంగిలో ఈ ప్రాజెక్టు కింద భీమారం మండలంలో 400 ఎకరాలు, చెన్నూరు మండలంలో 300 ఎకరాల్లో వరి పంట వేశారు. ప్రస్తుతం నాట్లు వేసి రెండు నెలలు కావస్తోంది. మరో నెల రోజులు నీరు అందితేనే పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. కానీ రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండడం నీటి మట్టం తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టులో నీరు తగ్గిపోయి తూము దిమ్మెలు బయటకు కనిపిస్తున్నాయి. గొల్లవాగు ప్రాజెక్టు నీటి మట్టం 0.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం చాలా మేరకు తగ్గిపోయిందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



గొల్లవాగు ప్రాజెక్టులో తగ్గిన నీటి నిల్వలు

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 10: వేసవిలో ప్రతీ ఇంటికి నిరంతరంగా తాగునీరు సరఫరా చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం మంచిర్యాల పట్టణంలోని గోసేవ మండల్ కాలనీలో ఇంటింటిరీ తిరుగుతూ తాగునీటి సరఫరాపై ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లంపల్లిప్రాజెక్టు, మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి నిరంతరంగా నీరు సరఫరా చేసేందుకు కార్యాచరణ ప్రకారం చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నీటి సరఫరాలో సమస్యలుంటే త్వరగా పరిష్కరించేలా అధికారులు కృషి చేస్తారని తెలిపారు. నీటిని సరఫరా చేయలేని ప్రాంతాలను గుర్తించి నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నందున వచ్చేమూడు నెలలు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, డీఈ, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

జిల్లా రైసుమిల్లులకు నిర్ధేశించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భారత ఆహార సంస్థ గోదాంను జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్‌తో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎంఆర్ ప్రక్రియలో భాగంగా రా రైసుమిల్లులు ప్రతి రోజు 1ఏసీకే, బాయిల్డ్ రైసుమిల్లులు 2 ఏసీకే పూర్తి చేసేలా చర్యలు తీసుకుని లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. మంచిర్యాలలో ఎఫ్‌సీఐ గోదాం స్థలం కేటయించకపోవడంతో బియ్యం దిగుమతిలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైసుమిల్లర్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కరీంనగర్ డివిజనల్ మేనేజర్‌తో మాట్లాడి వాగన్ మూమెంట్ త్వరగా చేపట్టి జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్ బియ్యం దిగుమతి పెరిగే విధంగా ఎఫ్‌సీఐలో స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 10: లోకసభ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 వరకు ఓటు ఆవశ్యకతపై అవగాహన, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, హోం ఓటింగ్‌పై సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 21 వరకు గేటెట్ కమ్యూనిటీలు, ఆర్‌డబ్ల్యూఏల ప్రతినిధులతో ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. 22 నుంచి 28 వరకు సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ద్వారా ఎన్నికల భాగస్వామ్యంపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

'కాకా కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు లేదు'

జైపూర్, ఏప్రిల్ 10: పెద్దపల్లి మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామి కాకా కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌కు లేదని జైభీం సైనిక్‌దళ్ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు శీలం వెంకటేష్, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులు రాజకీయంగా ఎదగడం చూసి ఓర్చుకోలేక బీజేపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఇది మానుకోవాలన్నారు. గడ్డం వంశీ గెలుపు కోసం కృషి చేస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని వెంటనే క్షమాపణలు చెప్పాలని కోరారు. సమావేశంలో నాయకులు బానేష్, మల్లేష్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు అడవులు ముఖ్యం



మాట్లాడుతున్న ఎఫ్ఎస్‌వో రామ్‌సింగ్

జైపూర్, ఏప్రిల్ 10: మానవాళి మనుగడకు అడవులు ఎంతో ముఖ్యమని గంగిపెల్లి ఎఫ్ఎస్‌వో ఆర్ రామ్‌సింగ్ అన్నారు. మండలంలోని గంగిపెల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు అడవులపై , వాటి రక్షణపై అవగాహన బుధవారం కల్పించారు. అడవిలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు నివారణ చర్యలపై వివరించారు. అడవుల్లోని చెట్లను ఎవరు నరకవద్దని, నరికితే అటవీ శాఖ కేసులు కఠినంగా ఉంటాయని చెప్పారు. మొక్కల పెంపకానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అడవులు ఉండడంతోనే వర్షాలు పడతాయని , రైతులకు పంటలు పండుతాయని వివరించారు. అడవిలో మంటలు కనబడితే అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని, మంటలను ఆర్పేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో సతీష్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అంబేద్కర్ సంఘం నాయకులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 10: మందమర్రిలో ఈ నెల 14న నిర్వహించే అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలని అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ నాయకులు పాత వీరస్వామి , రాజలింగు, రవీందర్, మొయ్య రాంబాబు అన్నారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అంబేద్కర్ జయంతి వేడుకలకు ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఆయన జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం, అంబలి పంపిణీ చేపడుతామని తెలిపారు. సమావేశంలో నాయకులు రవీందర్, నది, సంపత్, ఉపేందర్, షరీఫ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

కోటపల్లి, ఏప్రిల్ 10: మండలంలోని పిన్నారం గ్రామ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ చిప్ప దుర్గయ్యపై గ్రామస్థులు బుధవారం ఎంపీడీవో ఆకుల భూమయ్య, ఈజీఎస్ఏపీవో బాలయ్య కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 9న గ్రామంలో నిర్వహించిన ఉపాధిహామీ పనుల్లో పనులకు వెళ్లని వారి పేర్లను మస్టరులో హాజరైనట్లు ఫీల్డ్ అసిస్టెంట్ వేశాడని అందులో ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబీకులు, బంధువులు ఉన్నారని తెలిపారు. దీనిపై సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తే ఏం చేసుకుంటారో చేసుకోండని సమాధానం ఇచ్చాడని, దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు సత్తయ్య, శేక్ హైదర్, రాజేష్, బానేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

మల్యాల, ఏప్రిల్ 10: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి జరిగే చిన్నహనుమాన్ జయంతి ఏర్పాట్లను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం పరిశీలించారు. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు కలుగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచించారు. అలాగే నేరాలకు తావున్వికూడదన్నారు. కొండ పైన ఆల య పరిసరాలు, కోనేరు, మాలవిరమణ, క్యూలైన్‌లు ఎస్పీ పరిశీలించారు. వందలాది పోలీసులచే బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై అబ్దుల్ రహీం, ఆలయ ఈవో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీక్



వృధాగా పోతున్న నీరు

బెల్లంపల్లి, ఏప్రిల్ 10: ఎండకాలంలో ప్రజలు నీటి కోసం అల్లాడు తుండగా మరో వైపు మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయి నీరు వృధాగా పోతుంది. పట్టణంలోని బెల్లంపల్లి బస్తీ 19వ వార్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలో ప్రతి సారి నీరు వదిలిన రోజు గంటకు పైగా నీరంతా వృధాగా పోతుంది. నీరు లీకవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీరు లీకేజీ కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రబోయిన రాజు(49) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం తన పొలం గట్టుపై ఉన్న గడ్డిని కోస్తున్నాడు. ఆ ప్రాంత్రానికి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. చూసుకోకుండా అటువైపు వెళ్లి గడ్డి కోసిన రాజు విద్యుదాఘాతం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు కుమారుడు ముద్ర బోయిన రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా తాగునీరు సరఫరా చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 10: వేసవి అయినందున తాగునీటి ఎద్దడి సమస్యతలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతో బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మాట్లాడుతూ తాగునీటి సరఫరా కొరకు మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో ప్రత్యేక అధికారులను నియమించి అవసరమైన కార్యచరణ రూపొందించాలని, చేతి పంపులు, బోర్‌వెల్‌ల మరమ్మత్తులను వెంటనే చేపట్టాలన్నారు. బోర్‌వెల్‌లు, నల్లాల ద్వారా తాగునీటి సరఫరా చేయలేని ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసంమున్సిపాలిటీల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమలో అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఈవో యాదయ్య, డీఆర్‌డీవో కిషన్, సత్యం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ భూములను కాపాడాలి

- తహసీల్దార్‌కు తుడుందెబ్బ నాయకుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాసిపేట, ఏప్రిల్ 10: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరుతూ బుధవారం తుడుందెబ్బ నాయకులు తహసీల్దార్ భోజన్నకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, భూములు కబ్జా కాకుండా కాపాడాలని కోరారు. అలాగే ఆదివాసీ గ్రామాల్లో ఉన్న భూముల విరాసత్, మిస్సింగ్ సర్వే నంబర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70, పీసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుని ఏజెన్సీ భూములను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు ఆత్రం జంగు, కుర్సెంగ తిరుపతి, ఆడె జంగు, పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, మహేష్, అచ్యుత్‌రావు, మాన్కు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- యువత గొడవలకు పాల్పడొద్దు
- బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్



మాట్లాడుతున్న బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్

నెన్నెల, ఏప్రిల్ 10: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన మైలారం, గొళ్లపల్లిల్లో బుధవారం పర్యటించారు. పోలీంగ్ బూత్‌లను పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై మాట్లాడారు. ఓటుహక్కు వినియోగించుకోవడం బాధ్యతగల పౌరుల లక్షణమని అన్నారు. సర్కిల్ పరిధిలోని అతి సమస్యాత్మక, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఆ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో కమ్యూనిటీ పోలిసింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సంఘ విద్రోహ శక్తులకు యువకులు సహకరించవద్దని కోరారు. ప్రధానంగా యువత ఎన్నికల సమయంలో లేని పోని గొడవల్లో తలదూర్చి కేసుల పాలు కావద్దని సూచించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం కేంద్ర బలగాలతో కలిసి బ్రిడ్జీలు, కల్వర్టులను తనిఖీ చేశారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ విజయ్, సిబ్బంది ఉన్నారు

వార్డుల్లో తాగునీటిపై సర్వే

బెల్లంపల్లి, ఏప్రిల్ 10: పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ మీకు ఏ తాగునీరు వస్తుంది, రోజు వస్తుందా అని బుధవారం అధికారులు సర్వే చేపట్టారు. ప్రతీ ఇంటికి వెళ్లి నల్లా కనెక్షన్ ఉందా, మిషన్ భగీరథ పైపుల నుంచి నీరు వస్తుందా, గోదావరి నీరు వస్తుందా అని , బోర్లు ఉన్నాయా, నీటి సమస్య ఉందా అని వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. రెండు మూడు రోజులకు తాగునీరు వస్తుందని, గోదావరి నీరు అసలే రావడం లేదని, తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

చెన్నూరు, ఏప్రిల్ 10: మండలంలోని సోమనపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఏపీవో గంగాభవానీ పరిశీలించారు. హాజరు పట్టికను తనిఖీ చేశారు. కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు ఒక్కరికి రూ. 300 కూలీ వస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు జూన్ మొదటి వారం వరకు పనులకు రావాలని సూచించారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించడం జరుగుతుందన్నారు.

ముగిసిన అమ్మవారి ఉత్సవాలు

చెన్నూరు, ఏప్రిల్ 10: మండలంలోని నాగాపూర్, ఆస్నాద, పొక్కూరు, దుగ్నేపల్లి, అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట గ్రామాల్లో ఉగాదికి ముందు రోజు సోమవారం ప్రారంభమైన మహామ్మాయి అమ్మవారి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. మహిళలు మంగళహారతులతో ఇంటింటికి వెళ్లి మహామ్మాయి అమ్మవారికి పూజలు చేసి ఉద్వాసన పలికి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలు ఉత్సవాలను ముగించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

భూమి చదును చేసిన యాజమానికి రూ. 50 వేల జరిమానా

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కాసిపేట, ఏప్రిల్ 10: కబ్జా కోరల్లో ప్రభుత్వ భూములు అనే శీర్షికన ఈ నెల 7న 'ఆంధ్రజ్యోతి' జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. దేవాపూర్‌లోని 84/1 సర్వే నంబరులో అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో ఎక్స్‌కావేటర్ సహాయంతో చదును చేస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఎక్స్‌కావేటర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పంచనామా అనంతరం భూ ఆక్రమణకు పాల్పడిన కుడెల్లి కొమురయ్యకు రూ. 50 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ భోజన్న తెలిపారు. అలాగే కోమటిచేనులో తెలుగుదేశం పార్టీ గద్దెను తొలగించి కాంప్లెక్స్ నిర్మిస్తున్న యాజమానికి నోటీసులు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కేంద్రం బీసీ జనగణన వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

కోటపల్లి, ఏప్రిల్ 10: కేంద్ర ప్రభుత్వం బీసీ జనగణనను వెంటనే చేపట్టాలని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని కొల్లూరు, బోరంపల్లి , రాంపూర్, దేవులవాడ, బబ్బెర చెలక, వెల్మపల్లి, అన్నారం, రాపన్‌పల్లి, అర్జున్‌గుట్ట గ్రామాల్లో బీసీ చైతన్య యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడారు. బీసీ జనగణన కోసం దేశ వ్యాప్తంగా బీసీలు ఉద్యమిస్తున్నారని జిల్లాలోను బీసీ వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. జనగణనతో పాటు చట్టసభల్లో జనాబా ప్రతిపాదికన రిజర్వేషన్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ రాజ్యాధికారం సాధించేందుకు జిల్లాలో బీసీలంతా సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా నాయకులు నీరటి రాజన్న, సోమయ్య, వెంకటేష్, అంజయ్య, రాజగౌడ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్కేపల్లిలో గుడిసె దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గుడిసె

కాసిపేట, ఏప్రిల్ 10: మండలంలోని మల్కేపల్లికి చెందిన కుడిమేత రాంచందర్ గుడిసె మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తూ మంటలు అంటుకుని కాలిపోయింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి రాంచందర్ కుటుంబంతో సహా బయట నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా గుడిసెలో నుంచి మంటలు చెలరేగాయి. కుటుంబీకులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో గుడిసె మొత్తం కాలిపోయింది. ఇంట్లో ఉన్న రూ. 20 వేల నగదు, ఫ్రిజ్, టీవీ, సెల్‌ఫోన్‌లతో పాటు నిత్యవసర సరుకులు , భూమి పత్రాలు, పిల్లల స్టడీ సర్టిఫికెట్లు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉండవచ్చని బాధిత కుటుంబీకులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఆర్ఐ సులోచన సందర్శించి పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు , కొంత నగదును అందజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రణయ్‌రాజ్(ఫైల్)

లక్సెట్టిపేటరూరల్, ఏప్రిల్ 10: మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట పట్టణంలోని హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో యువకుడు తీవ్రంగా గాయపడినట్లు లక్సెట్టిపేట పోలీసులు తెలిపారు. దండేపల్లి మండలం తాళ్లపేటకు చెందిన జలంపల్లి ప్రణయ్‌రాజ్(27) తన స్నేహితుడు సాయికుమార్‌ను తీసుకుని లక్సెట్టిపేటకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా దండేపల్లి వైపు నుంచి లక్సెట్టిపేటకు వస్తున్న ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. గాయాలైన యువకులను స్థానికులు అంబులెన్స్‌లో మంచిర్యాలకు తరలించారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ప్రణయ్‌రాజ్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సాయికుమార్ చికిత్స పొందుతున్నాడు. ప్రణయ్‌రాజ్ తల్లి అర్చన ఫిర్యాదు మేరకు కేసు ఏఎస్సై రామయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రికార్డులు అప్పగించాలి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 10: ఉపాధి హామీలో చేస్తున్న పనుల రికార్డులను తనిఖీ బృందానికి అప్పగించాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి పనులకు సంబంధించి రికార్డులను ఎఫ్‌ఏలు తనిఖీ బృందానికి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేత

మందమర్రిరూరల్, ఏప్రిల్ 10: ఉపాధిహామీఫీల్డ్ అసిస్టెంట్‌లకు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీవో రజియాసుల్తానాలు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పనులను చేసే కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో బీరయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులతో భయాందోళన

- ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లిన వార్డు ప్రజలు

బెల్లంపల్లి, ఏప్రిల్ 10: గత కొన్ని రోజులుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు రాత్రి సమయంలో తమ ఇంటి పరిసరాల్లోకి గ్రూపులుగా వచ్చి గంజాయి సేవిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారని కళాశాల సమీపంలోని ప్రజలు ప్రిన్సిపాల్ రవీందర్ దృష్టికి బుధవారం తీసుకువచ్చారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవించిన సిగరెట్ ముక్కలను పాడేస్తున్నారని, మహిళలు భయాందోళనలకు గురవుతున్నారని వివరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ప్రిన్సిపాల్‌కు చూపించారు. విద్యార్థులు రాత్రి పూట బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కన్నెపల్లి, ఏప్రిల్ 10 : కన్నెపల్లి మండలంలోని మాడవెల్లి గ్రామపంచాయతీలోని బొత్తపల్లిలో ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ టోర్నీలో విజేత జట్టుకు రూ. 20 వేలు, రన్నర్ జట్టుకు రూ. 15 వేలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించేందుకే క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోగుల రమేష్, అయిత లచ్చయ్య, మల్లేష్, మేనేజ్‌మెంట్ సభ్యులు ప్రభాకర్, అంజి, వంశీ, నరేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు, అధికారులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 10: ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అన్నారు. బుధవారం హైదరాబాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్, జిల్లాఅధికారులతో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు, పాఠశాలల మరమ్మతులు, తాగునీటి సరఫరా, వేసవి ఉష్ణోగ్రతలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కేటాయించిన మేరకు కేంద్రాలు ఏర్పాటుచేసి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. వేసవిదృష్ట్యా సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శకమిటీల ఆధ్వర్యంలో మరమ్మతులు పూర్తిచేసే విధంగా అధికారులు దృష్టి సారించాలన్నారు. వేసవి పూర్తయ్యే వరకు ప్రతిఇంటికి తాగునీటిని అందించే విధంగా కార్యచరణ రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మిషన్‌భగీరథ పథకంద్వారా నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటి సరఫరాచేయలేని ప్రాంతాలను గుర్తించి ట్రాక్టర్లద్వారా నీటిని అందిచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మేనెలలో నీటి సమస్య తీవ్రంగా ఉండేప్రాంతాలను గుర్తించామన్నారు. ఆ ప్రాంతాల్లో బావులు, బోర్‌వెల్‌లను గుర్తించి తాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతామన్నారు. జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, షామియానాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అలాగే పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మరమ్మతు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవి దృష్ట్యా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వడదెబ్బకు గురి కాకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో డీఈవో అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పౌరసరఫరాల మేనేజర్ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్ల ఆవిష్కరణ

రెబ్బెన, ఏప్రిల్ 10: మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో మహంకాళి ఆలయంలో ఈనెల 23నుంచి25వరకు నిర్వహించే మహంకాళి జాతర పోస్టర్లను బుధవారం ఆలయ అర్చకుడు దేవరవినోద్, ఆలయ అధ్యక్షుడు మోడం తిరుపతిగౌడ్, గ్రామస్థులు ఆవిష్కరించారు. ఏప్రిల్ 23న శివపార్వతుల కళ్యాణం, 24న అమ్మవారికి మొక్కులు, బోనాలు, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్టు అర్చకుడు తెలిపారు. ఈ జాతరను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు సురేష్, రవి, బాలకృష్ణ, మహేందర్, రాజు, లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పోరాట ఫలితంగా బస్సు సౌకర్యం

రెబ్బెన, ఏప్రిల్ 10: ఏఐటీయూసీ పోరాట ఫలితంగా గోలేటి ఎక్స్‌రోడ్డు నుంచి ఖైరిగూడ ఓపెన్‌కాస్టు వరకు కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించినట్టు గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, బయ్యమొగిలి తెలిపారు. బుధవారం గోలేటి ఎక్స్‌రోడ్డు నుంచి ఖైరిగూడ వరకు బస్సును ప్రారంభించారు. నాయకులు మారం శ్రీనివాస్, జగ్గయ్య, రాజేష్, కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

సిర్పూర్(టి), ఏప్రిల్ 10: కాంగ్రెస్‌పార్టీ సిర్పూర్ నియోజకవర్గ మైనార్టీవిభాగం పార్లమెంట్ ఎన్నికల పర్యవేక్షకుడిగా సయ్యద్ ఇనాయత్‌అలీని నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు టీపీసీసీ మైనార్టీ జనరల్ సెక్రెటరీఅబ్దుల్‌షకీల్ శుభాకాంక్షలు తెలుపుతూ పత్రం అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకోసం కష్టపడి పని చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఇప్పతు స్వేన్, తదితరులు పాల్గొన్నారు.

చింతగూడ పాఠశాలలో రూం టు రీడ్

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 10: మండలంలోని చింతగూడ పాఠశాలలో రూం టు రీడ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఇన్‌చార్జీ పద్మశ్రీ మాట్లాడుతూ సృజనాత్మకతతో కూడిన కథలద్వారా విద్యార్థుల్లో పఠనశక్తి పెరుగుతుందన్నారు. ఇందులో భాగంగా రూం టు రీడ్ ప్రతిపాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మినారాయణ, ఉపాధ్యాయురాలు ప్రియాంక పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

లింగాపూర్, ఏప్రిల్ 10: మండలంలోని జాముల్‌ధరలో బుధవారం సాయంత్రం గ్రామంలోని ఓ రైతు చేనులో పంట రక్షణకు అమర్చిన సోలార్‌విద్యుత్ తీగలకు తగిలి రైతు ఆత్రం సోముకు చెందిన ఎద్దు మృతిచెందింది. ఎద్దు విలువ సుమారు 30వేలరూపాయలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

అధ్వానంగా దంపూర్ రోడ్డు



కంకర తేలిన దంపూర్ రోడ్డు

లింగాపూర్, ఏప్రిల్ 10: లింగాపూర్ మండలం నుంచి తిర్యాణివరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైంది. మండలంలోని దంపూర్, లోద్దిగూడా, రాఘాపూర్, కోలంగూడా, నాగూగుడా తదితర గ్రామాల ప్రజలు నిత్యం మండలకేంద్రానికి ఈదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. జైనూర్ పెద్దమార్కెట్ కావడంతో నిత్యావసర సరుకుల కోసం వస్తుంటారు. అయితే ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇసుక ట్రాక్టర్లు ఎక్కువగా నడుస్తుండడంతో రోడ్డు అధ్వానంగా మారుతోంది. దంపూర్ మార్గం నుంచి కంటేగాంమ్, చిర్రకుంటా, దంపూర్ అటవీప్రాంతం నుంచి రోజుకు 5 నుంచి10ట్రాక్టర్లు నడుస్తుండంతో రోడు చేడి పోతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

● రోడ్డు పరిస్థితి మారడం లేదు..

- యాదగిరి, దంపూర్



ప్రభుత్వాలు మారిన మా రోడ్డు పరిస్థితులు మారడంలేదు.. పది సంవత్సరాల నుంచి మాఊరి ప్రజలు రోడ్డుకోసం చాలాసార్లు అధికారులకు విన్నవించారు. కానీ రోడ్డు మాత్రం చేపట్టడం లేదు.

కాగజ్‌నగర్‌లో అఖండ సప్తాహం



అఖండ సప్తాహంలో పాల్గొన్న సభ్యులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 10: కాగజ్‌నగర్ పట్టణంలో శ్రీకన్యాకపరమేశ్వరి ఆలయంలో బుధవారం అఖండ సప్తాహం వాసవి భజనమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నగరసంకీర్తన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం వివిధ పూజలను చేపట్టి భజన కార్యక్రమాలను నిర్వహించారు.

అంజనేయస్వామి పీటపూజ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 10: కాగజ్‌నగర్ గుంటూరు కాలనీలో బుధవారం జిల్లాల రాజన్నగౌడ్ నివాసంలో శ్రీ అంజనేయ స్వామి పీటపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణంలో హనుమాన్ మాలధారణ చేసిన స్వాములకు భిక్ష నిర్వహించారు. అనంతరం భజన చేపట్టారు.

108లో ప్రసవం

సిర్పూర్(యు), ఏప్రిల్ 10: మండలంలోని మతురా తండాకు చెందిన ఎం జ్యోతి(27) అనే గర్భిణి బుధవారం 108లో ప్రసవించింది. బాధితురాలు పురిటినొప్పులతో బాధ పడుతుండగా కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది వెంటనే స్పందించి మతురా తండాకు వెళ్లి బాధితురాలికి తీసుకెళ్తుండగా పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో వైద్యసిబ్బంది 108లోనే ప్రసవం చేశారు. అనంతరం వైద్యం కోసం ఆమెను ఉట్నూరు సివిల్‌ఆసుపత్రికి తరలించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జైనూర్, ఏప్రిల్ 10: జైనూరు మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ కుంర భగ్వంత్‌రావ్ సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయనను బుధవారం ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ ఎంపీఅభ్యర్థి ఆత్రం సక్కు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, మాజీసర్పంచ్ కుంరశాంరావ్, మండల పార్టీఅధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల పాల్గొన్నారు.

నువ్వుల విత్తనాలు పంపిణీ

కెరమెరి, ఏప్రిల్ 10: మండలంలోని కేస్లాగూడ, సాకడగ్రామాల్లో బెల్లంపల్లి కృషివిజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో రైతులకు నువ్వుల విత్తనాలను ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు నువ్వులలో తలెత్తే చీడపీడల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, బాలాజీ, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప విగ్రహానికి వెండి కిరీటం అందజేత

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 10: సిర్పూర్(టి) మండలం రుద్రాపూర్‌లో ఈనెల 21న అయ్యప్ప ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆసిఫాబాద్ అయ్యప్ప స్వాములు మూలవిరాట్‌కు వెండికిరీటం తయారీకి సంబంధించిన రూ.1,01,111 విరాళంగా నిర్వహణ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వేణుగోపాల్, వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ అయ్యప్ప ఆలయం ప్రారంభించడం శుభ సూచకం అన్నారు. ఆలయ నిర్వహణ కమిటీని అభినందించారు. కార్యక్రమంలో గురుస్వామి భాస్కర్‌శర్మ, ఆసిఫాబాద్ అయ్యప్ప ఆలయకమిటీ సభ్యులు వినాయక్, శ్రీనివాస్, హరీష్, సంతోష్, రవీందర్, దాసు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వానపత్రికను అందజేశారు.



మూగ రోదన


ప్లాస్టిక్ కవర్లను తింటున్న పశువులు(ఫైల్)

- పశుగ్రాసం దొరకక అల్లాడుతున్న మూగజీవాలు
- వరిసాగు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు
- పొరుగు ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్న రైతులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 10: వేసవి వచ్చిందంటే పశువులకు మేత కష్టాలు తప్పవు. వేసవికాలంలో మేత, నీరు దొరక్క మూగజీవాలు అల్లాడుతున్నాయి. పశుగ్రాసం కరువు అవడంతో రైతులు పొరుగు ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. అయితే మేత కంటే దాని రవాణే వారికి తడిసి మోపెడవుతోంది. లారీగడ్డి రూ.25వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టి కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో వివిధ గ్రామాల్లో రైతులకు పశుపోషణ పెనుభారంగా మారింది. జిల్లాలో వరిపంట అతి తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. జిల్లాలో దహెగాం, సిర్పూర్(టి), తిర్యాణి, రెబ్బెన, కౌటాల, బెజ్జూరు, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మండలాల్లో మాత్రమే వరిసాగు చేస్తుంటారు. వాంకిడి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో నీటి లభ్యత లేని కారణంగా అక్కడి రైతులు ఆరుతడి పంటలైన పత్తి, సోయా పంటలనే పండిస్తుంటారు. దీంతో ప్రస్తుతం గ్రామాల్లో గ్రాసం కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వేసవిలో పశువులకు గ్రాసం ఎలా సమకూర్చాలో అర్థం కాక రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో పశు సంపద..

జిల్లాలో 10,17,833 పశువులు ఉండగా ఆవులు 2,78,674, బర్రెలు 51,354, గొర్రెలు 83,813, మేకలు 1,84,726 ఉన్నట్లు పశువైద్యాధికారులు చెబుతున్నారు. వీటన్నింటికి సరిపడ గ్రాసం లేక ఎక్కడి నుంచి తెచ్చుకోవాలో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో అనుకున్నంత స్థాయిలో వరిసాగు చేయకపోవడంతో పక్క జిల్లాలైన మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి రైతులు వరి గడ్డిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం గడ్డి కొరత ఏర్పడి డిమాండ్ బాగా పెరిగింది. లారీ గడ్డి రూ.25నుంచి రూ.30 వేల వరకు పెట్టి కొనాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పశువైద్య కేంద్రాల ద్వారా గ్రాసం సరఫరా చేస్తే తమకు కొంతైనా ఊరట లభిస్తుందని జిల్లాలోని రైతులు విన్నవిస్తున్నారు.


లారీలో పశుగ్రాసం తీసుకెళుతున్న రైతులు

కబేళాలకు తరలుతున్న పశువులు..

పశుపోషణ భారంగా మారడంతో రైతులు వాటిని కబేళాలకు తరలిస్తున్నారు. రైతులు అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ పశువుల ఆకలి కేకలను వినలేక దయనీయ దుస్థితిని చూడలేక దళారులకు అమ్ముకుంటున్నారు. పాడిపశువులు కళ్ల ముందే కబేళాలకు తరలిపోతున్న తీరును చూస్తూ రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. స్థానిక దళారులు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రకు చెందిన దళారులు పలు గ్రామాల్లో పశువులను కొనుగోలు చేస్తూ రాత్రికి రాత్రే కబేళాలకు చేరవేస్తున్నారు.

పొరుగు జిల్లాల నుంచి పశుగ్రాసం తెస్తున్నాం..: రోమాజీ, రైతు



పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉండడంతో మంచిర్యాల జిల్లా దండేపల్లి నుంచి వరిగడ్డిని కొనుగోలు చేసి తీసుకువస్తున్నాం. జిల్లాలో వరిసాగు అంతంత మాత్రంగానే ఉండడంతో పొరుగు జిల్లాల నుంచి తెచ్చుకోవాల్సి వస్తున్నది. దీంతో రైతులపై ఆర్థికంగా భారం పడుతోంది.

లారీ పశుగ్రాసానికి రూ.25 నుంచి రూ.30వేలు.. :గౌతం, రైతు



లారీ పశుగ్రాసానికి రూ.25నుంచి రూ.30 వేలకు కొనుగోలు చేస్తున్నాం. ఆర్థిక స్థోమత లేని రైతులకు పశువుల పోషణ భారమవుతున్నది. అధికారులు పశుగ్రాసం సాగుపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వం స్పందించి పశువైద్య కేంద్రాల ద్వారా గ్రాసం సరఫరా చేయాలి.



తీవ్రంగా పశుగ్రాసం కొరత..

జిల్లా అంతటా పశుగ్రాసం కొరత తీవ్రరూపం దాల్చింది. పశుగ్రాసం కోసం రైతులు చాలా ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. పశుగ్రాసం దొరకక పశువులు విలవిలలాడుతున్నాయి. ఓ వైపు తాగునీరు, మరోవైపు పశుగ్రాసం లభించక పశువులు బక్కచిక్కి పోతున్నాయి. దీంతో రైతులకు పశుపోషణ భారం కావడంతో కబేళాలకు అమ్మేస్తున్నారు. ఇక ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణ ప్రాంతంలో పశువులతీరు దయనీయంగా మారింది. గ్రాసం దొరకక చెత్తకుప్పలపై ఉన్న కాగితాలను, ప్లాస్టిక్ కవర్లను తింటూ మురికి కాలువల్లో నీటిని తాగుతూ రోగాల బారిన పడుతున్నాయి. ఇప్పటి వరకు పశుగ్రాసం కొరతను తీర్చేందుకు పశుసంవర్ధకశాఖ అధికారులు నీటివసతి ఉన్న ప్రాంతాలను గుర్తించి పశుగ్రాసం పెంచే విధంగా రైతుల్లో అవగాహన కల్పించడం లేదంటున్నారు. పశుసంవర్ధక శాఖాధికారులు పట్టించుకోక పోవడంతో పశుగ్రాసాన్ని పెంచేందుకు ఆసక్తి చూపడం లేదు.

జైళ్ల ఉన్నతీకరణ, విస్తరణకు ప్రత్యేక కమిటీ

- జిల్లా ప్రధానన్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేష్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ రమేష్

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 10: సుప్రీం కోర్టు సూచనల మేరకు జిల్లాలో ప్రస్తుతం ఉన్న జైళ్లను ఉన్నతీకరించి విస్తరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీలను ఏర్పాటు చేశామని జిల్లా ప్రధానన్యాయమూర్తి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేష్ తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలో కమిటీలతో ప్రత్యేకసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలలో ఉన్న జైళ్లను విస్తరించడం, తదనుగుణంగా కావాల్సిన భూమి అవసరాన్ని చూసేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఉన్న ప్రత్యేక ఉపకారాగారం విస్తరించి ఉన్న స్థలం, విచారణలో ఉన్న ఖైదీలకు కావాల్సిన సౌకర్యాలు, జైలు సామర్థ్యం, ఉన్నతీకరణలో భాగంగా ఎస్‌వోపీప్రకారం కల్పించాల్సిన సౌకర్యాలు, తదితరాలపై సమీక్షించారు. సమావేశంలో ప్రిన్సిపల్‌జూనియర్ సివిల్‌జడ్జి అనంతలక్ష్మి, రెవెన్యూఅధికారి లోకేశ్వర్ రావు, ఏఎస్పీసదయ్య, సూపరింటెండెంట్ ప్రేంకుమార్‌తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌లకు అవగాహన

వాంకిడి, ఏప్రిల్ 10: అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీ చైర్మన్‌లకు బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల అభివృద్ధికి చేయాల్సిన అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. మండలంలో 66అమ్మ ఆదర్శపాఠశాలలు ఉన్నాయని వీటికి చైర్‌పర్సన్‌గా స్వయంసహాయక సంఘాల అధ్యక్షులు, కమిటీకి చైర్మన్‌గా ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా కొనసాగుతారన్నారు. వీరుజాయింట్ అకౌంట్ తీయడం, వారు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్, ఎంపీడీవో వరలక్ష్మి,ఎంఈవో మనుకుమార్, ఏపీఎంమహేష్, ఆర్పీలుచైతన్య,ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలి

చింతలమానేపల్లి, ఏప్రిల్ 10: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని మాలి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్లె శ్రీనివాస్ డిమాం డ్ చేశారు. మండలంలోని డబ్బా గ్రామంలో మాలిసంఘం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి ప్రగతిభవన్ పేరును మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మారుస్తున్నట్లు ప్రకటించడం హర్షనీయమన్నారు. అదేవిధంగా ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. అలాగే మాలీలకు ఎస్టీ హోదా కల్పించి సామాజిక న్యాయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో మాలిసంఘం నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాలి సంఘం నాయకులు

ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలి


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆల్బర్ట్

పెంచికలపేట, ఏప్రిల్ 10: అర్హులైన ప్రతిఒక్కరికి ఉపాధిహామీ పనులు కల్పించాలని ఎంపీడీవో ఆల్బర్ట్ అన్నారు. బుధవారం చెడ్వాయి గ్రామంలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచాలన్నారు. కూలీల నమోదు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో గంగాసింగ్, కార్యదర్శి రాధ తదిరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి


ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 10: కాగజ్‌నగర్‌లో గురువారం రంజాన్ పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్థానిక ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించేందుకు ఈద్గాప్రాంతాన్ని శుభ్రం చేసి షామియానాలు ఏర్పాటుచేశారు. అలాగే ట్రాఫిక్‌నియంత్రించేందుకు పోలీసులు చర్యలు తీసుకున్నారు.

వసతుల కల్పనపై యాప్ ద్వారా పర్యవేక్షణ

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే


ఎస్పీ, ఇతర అధికారులతో కలిసి యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 10: జిల్లాలో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రాల్లో కల్పిస్తున్న సదుపాయాలపై యాప్‌ద్వారా పర్యవేక్షిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మూత్రశాలలు, ఇతర వసతుల కల్పనపై రూపొందించిన బీఎల్‌వోయాప్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 676పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతిపోలింగ్ కేంద్రంలో ర్యాంపు, తాగునీరు, షామియానా, మూత్రశాలలు, విద్యుత్, ఫ్యాన్‌లు, ఫర్నీచర్ సమకూర్చడంతో పాటు పోలింగ్‌కేంద్రానికి రహదారి, అంతర్గత రహదారుల ఏర్పాట్లపై పర్యవేక్షించారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్‌తివారి, దాసరివేణు, ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీసదయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత

ఓటుహక్కు వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో పోలీసు, పరిపాలనశాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వినియోగం చాలా ముఖ్యమన్నారు. అర్హతగల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకొని సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. జూన్6న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. అప్పటివరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఈనెల 15 లోగా ఓటరుగా నమోదుచేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించితే టోల్‌ఫ్రీనెం.1950, సీవిజిల్‌ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, ఎస్పీ సురేష్‌కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లాగ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీఎస్పీ సదయ్య, తహసీల్దార్ శ్రీని వాసరావుదేశ్‌పాండే, అధికారులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి

ఆసిఫాబాద్ రూరల్: వేసవి కాలం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, రిజిస్టర్లు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన ఖచ్చితంగా పాటించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రసవాల విషయంలో వైద్యులు, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతూ మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. సేవలలో ఏమైనా ఇబ్బంది ఉంటే వైద్యాధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


ధనోర వాటర్‌ప్లాంట్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కెరమెరి, ఏప్రిల్ 10: తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కేస్లాగూడ వాటర్ ప్లాంట్, ధనోర వాటర్ ప్లాంట్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేస్లాగూడ వాటర్ ప్లాంట్‌లో నీరు ఎన్నిగ్రామాలకు అందజేస్తున్నారన్నారు. రోజుకు ఎన్నిలీటర్ల నీరుఫిల్టర్ చేస్తున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉందాఅని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాటర్ పంపుహౌజ్‌ల వద్ద విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు. అలాంటి సమస్య మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. సాంగ్వీ గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. అలాగే రానున్న పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అన్నిరకాల మౌళికవసతులు కల్పించాలన్నారు. ఆయనవెంట అదనపుకలెక్టర్ దీపక్ తివారి, డీపీవో భిక్షపతిగౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటపతి, డీఈ రాకేష్, ఎంపీడీవో కృష్ణారావు, తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంపీవో అంజద్‌పాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 38.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఆసిఫాబాద్, ఏప్రిల్10: జిల్లాలో బుధవారం 38.9డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లాలో మూడురోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టగా ఆరెంజ్‌నుంచి యేల్లో జోన్‌లోకి మారింది. దహెగాం మండలంలో 38.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, కెరమెరిమండలంలో 38.3, కాగజ్‌నగర్ మండలంలో 38.1, పెంచికల్‌పేట,రెబ్బెనలలో38.0, బెజ్జూర్ మండలంలో 37.7, సిర్పూర్-టి మండలంలో 37.6, ఆసిఫాబాద్‌లో 37.0, తిర్యాణిమండలంలో 36.8డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్, ఏప్రిల్ 10: జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1,2,3,4, ఎస్ఎస్‌సీ, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్సై, కానిస్టేబుల్ తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కొరకు స్పెషల్ ఫౌండేషన్ కోర్సు ద్వారా మూడు నెలల ఉచిత శిక్షణ అందిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16న కాగజ్‌నగర్ పట్టణంలోని సాయితేజ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు.



సింగరేణి సమాచారం

కొలిమిలా మండుతున్న కోల్‌బెల్ట్

మందమర్రిటౌన్, ఏప్రిల్ 10: కోల్‌బెల్ట్ ప్రాంతం కొలిమిలా మండుతోంది. ఎండ తీవ్రత ప్రభావం కార్మికులపై తీవ్రంగాచూపుతోంది. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో ఎండలు దంచి కొడుతుండడంతో కార్మికులు విధులకు గైర్హాజరు అవుతున్నారు. దీంతో ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. కేవలం ఉదయం షిఫ్టులో మాత్రమే కార్మికులు ఆశాజనకంగా హాజరవుతున్నారు. గనులకు 350మందికి పైగా హాజరయ్యే కార్మికులు 150 మంది, డిపార్టుమెంట్లలో వందమందికి పైగా హాజరవుతున్నట్లు తెలుస్తోంది. రెండవ షిఫ్టులో మాత్రం కార్మికులు తక్కువ సంఖ్యలో హాజరవుతున్నారు. రాత్రి షిఫ్టులో కొంత ఎక్కువ కార్మికులు హాజరవుతున్నారు. మధ్యాహ్నం రోడ్లు, మార్కెట్‌ప్రాంతాలు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండలకు భయపడి ప్రజలు మధ్యాహ్నం 12దాటితే ప్రజలు, కార్మికులు బయటకు రావడం లేదు. చాలామంది కార్మికులు సెలవులు పెట్టి ఇంటివద్దనే కుటుంబాలతో గడుపుతున్నారు. ఏదిఏమైనా ఎండలు ఎక్కువగా ఉండడంతో గనులకు కార్మికుల హాజరుశాతం తక్కువవుతుండడంతో ఉత్పత్తిపై కొంత ప్రభావం పడుతోంది.

ఎస్ఆర్పీ-1 గనిపై ఐఎన్‌టీయూసీ సభ్యత్వం

నస్పూర్, ఏప్రిల్ 10: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-1గనిపై బుధవారం ఐఎన్‌టీయూసీ సభ్యత్వ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. పలువురు కార్మికులు ఐఎన్‌టీయుసీ సభ్యత్వాన్ని స్వీకరించారని యూనియన్ వైస్‌ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు తెలిపారు. ఐఎన్‌టీయుసీ దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన అతిపెద్ద కార్మిక సంఘమన్నారు. శ్రీరాంపూర్‌ఏరియా సింగరేణిలోనే పెద్ద ఏరియా అని, ఇక్కడ అధికసభ్యత్వం సేకరించి అగ్రస్థానంలో నిలవాలనే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయుసీ జాతీయసమితి సభ్యుడు భీంరావు, కేంద్రకమిటీ నాయకులు గరిగెస్వామి, ఏరియా కార్యదర్శి వెంకటేష్, కలవేని శ్యాం తదితరులు పాల్గొన్నారు.

బహుజన మహనీయుల మాసోత్సవం

నస్పూర్, ఏప్రిల్ 10: నస్పూర్ పట్టణం సీసీసీ కార్నర్‌లో బుధవారం సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో బహుజన మహనీయుల మాసోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సమాన హక్కుల కోసం ఉద్యమించిన బహుజన మహనీయులు చూపిన తోవలో శ్రమజీవులు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లాఅధ్యక్షుడు రంగు రాజేశం, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) శ్రీరాంపూర్ బాధ్యులు అంకుస్, రంజిత్, ఐలయ్య, నాగరాజు, శివ, మొగిలి, సాయి కిరణ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ప్రచారం


బూర్గుడలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణక్క

ఆసిఫాబాద్ రూరల్/వాంకిడి, ఏప్రిల్ 10: ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సుగుణక్క బుధవారం మండలంలోని బూర్గుడ, చోర్‌పల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఆరుగ్యారెంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఒకేపార్టీ అధికారంలో ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వాంకిడి మండలంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో సుగుణక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమపథకాలను ప్రజలకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజలు అధిక మెజార్టీతో గెలిపిస్తే మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరుస్తానని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, బాలేష్‌గౌడ్, చరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి..

రెబ్బెన: రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం కొండపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు రమేష్, దేవాజీ, సుదర్శన్‌గౌడ్, చిరంజీవి గౌడ్, ప్రభాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.